ముస్లిం సోదరులకు కేసీఆర్ బక్రీద్ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. దైవాజ్ఞను అనుసరించి సమాజ హితంకోరి ప్రతీ మానవుడు నిస్వార్థ సేవలను అందించాలనే సందేశం బక్రీద్ మనకు అందిస్తుందని పేర్కొన్నారు. తమకు కలిగిన దాంట్లోంచి ఎంతో కొంత ఇతరులకు పంచడమనే దాతృత్వ స్వభావాన్ని బక్రీద్ ద్వారా నేర్చుకోవచ్చని సూచించారు.

కేసీఆర్‌పై సుమోటో కేసు పెట్టాలి

హైకోర్టుకు పీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ వినతి

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఒక జస్టిస్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను హైకోర్టు సుమోటోగా తీసుకోవాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 'మీరు అర్హత కోల్పోయారు. నిష్పాక్షికత కనిపించడం లేదు. మీ ముందు ఏమి చెప్పినా ప్రయోజనం ఉండదు' అని ఒక జస్టిస్‌ను ఉద్దేశించి లేఖ రాయడం క్షమార్హం కాదని పేర్కొన్నారు. పదేండ్లు సీఎంగా ఉన్న వ్యక్తి.. 'మీరు విచారణ నుంచి తప్పుకోవాలి' అని జస్టిస్ నరసింహారెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించడం సరికాదని అన్నారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు కొనుగోలుపై వివరణకు కమిషన్ ఇచ్చిన గడువు లోపు వివరణ ఇవ్వకుండా ప్రత్యారోపణలు చేస్తూ, ప్రతిదాడి చేస్తూ లేఖ రాయడం చట్ట విరుద్ధమన్నారు. జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ 25 మందిని వివరణ కోరితే కేసీఆర్ ఒక్కరే ఇలా స్పందించడం సరికాదని పేర్కొన్నారు.

వాదన వినకుండానే తీర్పా?

- పక్షపాత ధోరణిలో కమిషన్ చైర్మన్
- కాంగ్రెస్ అభిప్రాయాలకు వంత
- రెండు ప్రభుత్వాల మధ్య అవినీతా?
- సూపర్ క్రిటికల్ టెక్నాలజీ గురించి తెలియనోళ్లూ మాట్లాడేస్తున్నరు
- పీజీసీఐఎల్ లైన్‌బుకింగ్ వల్లే ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు ఒప్పందం
- మా శ్రమ ప్రజలకు తెలియాలనే కమిషన్ ఏర్పాటును స్వాగతించాం
- మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి. ఎమ్మెల్సీ రవీందర్‌రావు చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నదని విద్యుత్తు శాఖ మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. తమ వాదన వినకుండా, పూర్తిస్థాయిలో విచారించకుండానే ఓ నిర్ణయానికి ఎలా వచ్చేస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్తుశాఖలో అక్రమాలు జరిగాయంటూ విచారణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ వ్యవహరిస్తున్న తీరుపై జగదీశ్‌రెడ్డి ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. నాడు తెలంగాణ ఉద్యమానికి ద్రోహం చేసిన వాళ్లంతా నేడు ప్రభుత్వంలో ఉండి కమిషన్ల పేరుతో కేసీఆర్ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. చీకట్లలో ఉన్న తెలంగాణను అభివృద్ధిపథంలోకి నడిపించిన కేసీఆర్ కృషిని కనీసం కమిషన్ అయినా బయటపెడుతుందని ఆశపడినట్టు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విచారణ పూర్తికాకుండా, మరోపక్షం వాదనలు వినకుండా తమ విచారణ నివేదిక ప్రభుత్వానికి సమర్పించకుండానే పక్షపాత వైఖరితో కమిషన్ మీడియాతో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలను ఆక్షేపిస్తున్నట్టు పేర్కొన్నారు. కమిషన్ చైర్మన్ రాజీనామా చేయాలని కేసీఆర్ కోరడాన్ని తామంతా సమర్థిస్తున్నట్టు తెలిపారు.

విచారణ అర్హత కోల్పోయారు

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన విద్యుత్తు ప్రాజెక్టులు, ఛత్తీస్‌గఢ్‌తో కరెంటు కొనుగోలు ఒప్పందం తదితర అంశాలపై తమ ప్రభుత్వ హయాంలోనే కాంగ్రెస్, బీజేపీ పెద్దలు సందేహాలు లేవనెత్తితే అప్పుడే అసెంబ్లీ సాక్షిగా సమాధానం చెప్పినట్టు జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. విద్యుత్తుశాఖపై మళ్లీ శ్వేతపత్రం విడుదల చేస్తూ చర్చపెడితే అప్పుడు కూడా వాస్తవాలు వివరించామని పేర్కొన్నారు. ఎటువంటి విచారణకైనా సిద్ధమని శాసనసభలోనే చెబితే జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కమిషన్ వేశారని గుర్తుచేశారు. విచారణకు ముందే కమిషన్‌కు ఏవో ఉద్దేశాలు ఉన్నాయని, వాదనలు వినకుండా తీర్పులు ఇచ్చే పద్ధతుల్లో చేసిన వ్యాఖ్యలు ఎంతో బాధ కలిగించాయని, ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపాయని, కాబట్టి ఈ విచారణ చేయడానికి వారు అర్హత కోల్పోయారని పేర్కొన్నారు.

తెలంగాణ బిడ్డగా ఆయనపై గౌరవం ఉంది

చీకట్లలో ఉన్న తెలంగాణను ఏడాదిలోపే అద్భుతమైన వెలుగులతో నింపిన పరిపాలకుడిగా, విజనరీ లీడర్‌గా కేసీఆర్ పట్ల కమిషన్ చైర్మన్‌కు మంచి అభిప్రాయం ఉంటుందని అంతా అనుకున్నట్టు జగదీశ్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ బిడ్డగా ఎల్ నర్సింహారెడ్డి అంటే కేసీఆర్‌కు చాలా గౌరవం ఉందని తెలిపారు. జడ్జి కాక ముందు తెలంగాణవాదిగా ఉన్నారని, ఆ తర్వాత వారి అభిప్రాయాల్లో మార్పులు వచ్చాయని తెలిపారు. హైకోర్టు సీజేగా చేసిన వారి ఆలోచనలు కూడా కాంగ్రెస్, బీజేపీ నాయకుల అభిప్రాయాలకు అనుకూలంగా మారాయనే విషయాన్ని 11వ తేదీన నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారే బయటపెట్టుకున్నారని విమర్శించారు. తామెప్పుడూ కమిషన్‌ను వ్యతిరేకించలేదని, గతంలో ఇలాంటి కమిషన్లపై చాలామంది కోర్టులకు వెళ్లి ఆపిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. చట్టబద్ధమైన ఈఆర్సీలు ఇచ్చిన తీర్పులపై ప్రభుత్వాలకు విచారణ జరిపే హక్కు ఉండదని, ఆ విషయం సీజేగా పనిచేసిన వ్యక్తికైనా తెలిసి ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయం తమకు తెలిసినప్పటికీ కమిషన్‌పై నమ్మకంతో ఆ విషయం మాట్లాడలేదని చెప్పారు.

పీజీసీఐఎల్ లైన్‌బుకింగ్ వల్లే ఒప్పందం

పీజీసీఐఎల్ లైన్‌బుకింగ్ వల్లే ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు ఒప్పందం చేసుకున్నామని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. నాడు దక్షిణాది నుంచి ఉత్తరాదికి విద్యుత్తు సరఫరాలకు లైన్లు లేవని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో మొదటిసారిగా ఉత్తర భారతం నుంచి దక్షిణానికి విద్యుత్తు లైన్ వస్తున్న క్రమంలో దానిని ముందుగానే బుక్ చేసుకోవాలంటే ఉత్తరాదిలో ఉన్న ఏదైనా పవర్ ప్లాంట్ నుంచి ఒప్పందం ఉండాలనే నిబంధన ఉన్నట్టు జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. అలా ఉంటేనే లైన్‌లో వచ్చే కరెంటును కొనుగోలు చేసుకోవాడనికి అనుమతులు ఇస్తారని వివరించారు. పీజీసీఐఎల్ అనేది ప్రభుత్వ రంగ సంస్థ అని, విద్యుత్తు కొనుగోలు ధర నిర్ణయించేది ఈఆర్సీలు కాబట్టి ప్రభుత్వ నిర్ణయం చెప్పామని పేర్కొన్నారు. కేసీఆర్ చొరవతో తెలంగాణకు 1000 మెగావాట్ల విద్యుత్తును ఇచ్చేందుకు అప్పటి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణసింగ్ అంగీకరించారని తెలిపారు. 'ఒక ప్రభుత్వం నుంచి మరొక ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే అవినీతికి ఆస్కారం ఉంటుందా?' అని ప్రశ్నించారు.

యూనిట్‌కు రూ.3.94 చొప్పున కొనుగోలు

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీలు కలిసి లెక్కలు వేసి మిగులు విద్యుత్తు ఒక్కో యూనిట్‌కు రూ. 3.94 చొప్పున ధర నిర్ణయించినట్టు జగదీశ్‌రెడ్డి వివరించారు. తమిళనాడు రూ.4.94, కర్ణాటక రూ.4.33 చొప్పున అగ్రిమెంట్ చేసుకున్నట్టు తెలిపారు. మరి ఇందులో లోపం ఎక్కడ జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. పార్టీలు చేసిన ఆరోపణలే జడ్జి మనసులోనూ ఉన్నాయని ఇప్పుడు తమకు తెలిసిందని, ఆయన ఏయే పార్టీలతో సంబంధం ఉన్నదనేది తమకు తెలియదని పేర్కొన్నారు. కేసీఆర్ వివరణ, అవసరమైతే ఛత్తీస్‌గఢ్, కేంద్ర సంస్థల నుంచి వివరణ తీసుకున్న తర్వాత ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని, కానీ మధ్యలోనే మీడియాకు వివరాలు ఎలా వెల్లడిస్తారని నిలదీశారు. దేశంలో వేసిన వందలాది కమిషన్లు ఎప్పుడైనా ఇలా మధ్యలోనే ప్రెస్‌మీట్లు పెట్టాయా? అని ప్రశ్నించారు. దీనిని బట్టే వారి దురుద్దేశం ఏమిటో అర్థమైందని పేర్కొన్నారు.

ప్రైవేట్ కంపెనీల తరపున కాంగ్రెస్ వత్తాసు

భద్రాద్రి పవర్‌ప్లాంట్ విషయంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కాకుండా సబ్ క్రిటికల్ టెక్నాలజీ వాడారంటూ కాంగ్రెస్ చేసిన విమర్శలకు జగదీశ్‌రెడ్డి బదులిస్తూ దేశంలో 90శాతం విద్యుదుత్పత్తి సబ్ క్రిటికల్ టెక్నాలజీతోనే జరుగుతున్నదని, తెలంగాణ విద్యుత్తు ప్రయోజనాలను కేసీఆర్ దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ఇవ్వకుండా పారదర్శకంగా ఉండే ప్రభుత్వ రంగసంస్థ బీహెచ్ఈఎల్‌కు భద్రాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణ బాధ్యతలు ఇచ్చారని చెప్పారు.

సూపర్ క్రిటికల్‌కు కనీసం 8 ఏండ్ల వ్యవధి

సూపర్ క్రిటికల్ ప్లాంట్‌ను తీసుకురావడానికి కనీసం కనీసం 8 నుంచి 10 ఏండ్లు పడుతుందని స్వయంగా బీహెచ్ఈఎల్ ప్రతినిధులు చెప్పారని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. ఎంతత్వరగా పూర్తి చేయాలనుకున్నా కనీసం 5 ఏండ్లు పడుతుందని చెప్పినట్లు తెలిపారు. 'ప్రస్తుతం 270 మెగావాట్ల ఉత్పత్తికి ఎక్విప్‌మెంట్ సిద్ధంగా ఉంది. వాటితో నాలుగు ప్లాంట్లు పెట్టుకుంటే 1080 మెగావాట్లు పెట్టుకోవచ్చు. అలాగైతే రెండేండ్లలో పూర్తిచేసి ఇస్తాం' అని వారు హామీ ఇవ్వడంతో అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. దురదృష్టవశాత్తూ తెలంగాణ వ్యతిరేకి ఒకరు ఎన్‌జీటీలో కేసు వేస్తే దానికి స్టే ఇవ్వడం వల్ల ఆలస్యమైందని తెలిపారు. ప్లాంట్ల నిర్మాణంలో నాటి సీఎండీ ప్రభాకర్‌రావు వంటివారు నిర్మాణదారులతో మాట్లాడి రూ.400 కోట్లు ప్రభుత్వ సొమ్మును మిగిల్చారని గుర్తుచేశారు.

నాడు బొగ్గు తరలిస్తే నోరు మెదపలె?

అభివృద్ధి ఒకేచోట కేంద్రీకృతం కాకుండా సమానంగా జరగాలనేది కేసీఆర్ తపన అని, అందుకే యాదాద్రి పవర్ ప్లాంట్‌ను తీసుకొచ్చారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ భూమి, నీళ్లు, రోడ్డు, రైలు మార్గం వంటివి అందుబాటులో ఉన్న నల్లగొండలో యాదాద్రి పవర్ ప్లాంట్‌ను తీసుకొచ్చారని తెలిపారు. యాదాద్రికి బొగ్గు తీసుకురావడానికి డబ్బులు ఖర్చు అవుతాయని వితండవాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, సమైక్యాంధ్రలో వీటీపీఎస్‌కు, రాయలసీమ ఆర్టీపీపీకి బొగ్గు ఎక్కడి నుంచి తీసుకెళ్లారని ప్రశ్నించారు. 900 కిలోమీటర్లు ఎలా తరలించారని నిలదీశారు. కేసీఆర్ మీద బురదజల్లాలనే దురుద్దేశంతోనే ఇదంతా జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, నాయకులు గెల్లు శ్రీనివాస్, రావుల చంద్రశేఖర్ రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ పాల్గొన్నారు.

సబ్ క్రిటికల్, సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అంటే?

దేశంలో 90 శాతం విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు సబ్ క్రిటికల్ టెక్నాలజీ కలిగినవే. వీటిలో ఒక్కప్లాంట్‌లో 30 మెగావాట్ల నుంచి 60, 100, 200, 500 మెగావాట్ల వరకు విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. వీటివల్ల పర్యావరణానికి కొంత ముప్పు వాటిల్లుతుందని కేంద్రం చెప్పున్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా ఒక ప్లాంట్‌లో 800 మెగావాట్లకు పైగా విద్యుత్తును ఉత్పత్తి చేసే టెక్నాలజీ వచ్చింది. దీనికి సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అని పేరు పెట్టారు. 800 మెగావాట్లలోపు ఉత్పత్తి చేసే విద్యుత్తు వ్యవస్థలను సబ్ క్రిటికల్ టెక్నాలజీ అని, 800 మెగావాట్లకు పైగా ఉత్పత్తి చేసే ప్లాంట్ టెక్నాలజీని సూపర్ క్రిటికల్ వ్యవస్థలని అంటారు. తక్కువ సామర్థ్యంతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్తు ప్లాంట్ల ద్వారా పొగ ఎక్కువగా వస్తుందని, దీనివల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్న చర్చ మొదలైంది. ఫలితంగా సూపర్ క్రిటికల్ వ్యవస్థ తెరపైకి వచ్చింది. ఆ తర్వాత ప్రపంచ దేశాల మధ్య ఒప్పందం జరిగింది. దాని ప్రకారం 2017 మార్చిలోపు నిర్మితమయ్యే అన్ని విద్యుత్తు ప్లాంట్లకు ఏ టెక్నాలజీ అయినా ఉపయోగించుకోవచ్చు. ఆ తర్వాత మాత్రం తప్పనిసరిగా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ వ్యవస్థ ఉండాలి.

కేసీఆర్ అభ్యంతరాలను పునఃపరిశీలిస్తాం

జస్టిస్ నర్సింహారెడ్డి వెల్లడి

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణంపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంధించిన లేఖపై స్పందించారు. కేసీఆర్ లేవనెత్తిన అభ్యంతరాలను తాము పునఃపరిశీలిస్తామని తెలిపారు. కేసీఆర్ శనివారం పంపించిన లేఖలో కమిషన్ చట్టబద్ధతను ప్రశ్నించారు. కమిషన్ చైర్మన్ పదవి నుంచి జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి స్వచ్ఛందంగా తప్పుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో జస్టిస్ నర్సింహారెడ్డి ఆదివారం ఒక న్యూస్ చానల్‌తో మాట్లాడుతూ.. కేసీఆర్ లేఖపై నిపుణులతో చర్చిస్తానని తెలిపారు. లేఖలో కొన్ని ప్రశ్నలకు కేసీఆర్ సమాధానాలిచ్చారని, పలు అంశాలను లేఖలో ప్రస్తావించారని, కేసీఆర్ చెప్పిన వివరాలకు, వాస్తవాలకు సరిపోల్చాల్సి ఉన్నదని పేర్కొన్నారు.కేసీఆర్ రాసిన లేఖపై కమిషన్ మంగళవారం సమీక్షించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

మంగళవారం మరో ఇద్దరి విచారణ

తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, విద్యుత్తు జేఏసీ నేత రఘును కూడా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ మంగళవారం విచారించనున్నది. ఉదయం 11 గంటలకు కమిషన్ ముందు హాజరుకావాలని వారిద్దరికీ విచారణ కమిషన్ కార్యాలయ వర్గాలు సమాచారాన్ని అందించాయి.

న్యాయవ్యవస్థను కించపరుస్తున్న కేసీఆర్

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూన్ 16 : బీఆర్ఎస్ హయాంలో చేసిన విద్యుత్తు ఒప్పందాల్లో అవినీతి జరిగిందని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిటీని కేసీఆర్ కించపరుస్తున్నారని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం జగిత్యాలలో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ టెండర్లు పిలవకుండా నామినేషన్ పద్ధతిలో పవర్ ప్రాజెక్ట్ ఇవ్వడంతో తెలంగాణ రూ.40 వేల కోట్లు అప్పుల పాలైనట్టు ఆరోపించారు. కమిషన్ విచారణకు కేసీఆర్ సహకరించకపోవడం సరికాదని అన్నారు.

చలో మొబిలిటీకే బాధ్యతలు

- నిబంధనల మేరకే ఏఎఫ్‌సీఎస్
- ఆరోపణలన్నీ అర్థరహితం
- కమిటీ సిఫారసు మేరకే నిర్ణయం
- టీజీఎస్ ఆర్టీసీ వివరణ

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకు బోర్డు అనుమతితోనే ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ (ఏఎఫ్‌సీఎస్) అమలు బాధ్యతలను చలో మొబిలిటీ కంపెనీకి అప్పగించినట్టు సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. ఏఎఫ్‌సీఎస్ అమలుకు డిజిటల్ టికెటింగ్ టెండర్ ప్రకటనను 2022 నవంబర్ 2న టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం విడుదల చేసిందని తెలిపింది.టెండర్‌లో ఆరు కంపెనీలు పాల్గొన్నాయని చెప్పింది. ఆన్‌లైన్ టికెట్ రిజర్వేషన్, డిజిటల్ టికెటింగ్ సౌకర్యం ఒకటే సర్వీస్ ప్రొవైడర్ దగ్గరుంటే నిర్వహణ సులువుగా ఉంటుందని యాజమాన్యం భావించిందని తెలిపింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల శాఖ... ప్రజారవాణా వ్యవస్థలో సాంకేతికత అమలుకు రూ.20.97 కోట్లు సంస్థకు మంజూరు చేసినట్టు చెప్పింది. వీటితో ఐటిమ్స్‌ను సొంతంగా కొనుగోలు చేయాలని సంస్థ నిర్ణయించిన మేరకు టెండర్‌ను 2023 జూలై 3న రద్దు చేసినట్టు చెప్పింది. ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేయాలనే ఉద్దేశంతో 2024 జనవరి 11న మరో టెండర్ ప్రకటనను సంస్థ విడుదల చేసిందని వెల్లడించింది. డిజిటల్ టికెటింగ్, ఆన్‌లైన్ రిజర్వేషన్, ఐటిమ్స్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, నిర్వహణ అంశాలను వేర్వేరుగా పేర్కొంటూ జారీ చేసిన టెండర్‌లో మూడు కంపెనీలు పాల్గొన్నాయని చెప్పింది. వాటి సేవలు సంతృప్తికరంగా లేనందున టెండర్‌ను ఫిబ్రవరి 29న రద్దు చేసినట్టు తెలిపింది. ఏఎఫ్‌సీఎస్ కోసం సంస్థ ఉన్నత స్థాయి కమిటీని నియమించిందని చెప్పింది. ఈ కమిటీ పలు రాష్ట్రాల్లో పర్యటించి, ఇతర కంపెనీలతో బేరీజు వేసుకుని చలో మొబిలిటీకి బాధ్యతను అప్పగించాలని ప్రతిపాదించినట్టు వెల్లడించింది. చలో మొబిలిటీ సంస్థకు క్యూఆర్ బేస్డ్ మొబైల్ టికెటింగ్, క్లోజ్డ్ లూప్ స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ పాసెస్, ఎన్‌సీఎంసీ కార్డుల జారీలో విశేష అనుభవం ఉందని పేర్కొన్నది. ఈ కంపెనీ బృహన్ ముంబై ఎలక్ట్రిక్ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ (బెస్ట్)లో 3500 బస్సుల్లో సమర్థసేవలను అందిస్తున్నదని తెలిపింది. సంస్థ టెండర్, ఒప్పందాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి, రవాణా మంత్రిత్వ శాఖకు ఎలాంటి ప్రమేయం ఉండదని, పూర్తిగా బోర్డు అనుమతి మేరకే సంస్థలో నిర్ణయాలు తీసుకుంటున్నట్టు చెప్పింది.

ఫేక్‌మనీతో బ్లాక్‌మనీ చోరీకి ప్లాన్!

- '950కోట్లు' కొట్టేసేందుకు స్కెచ్!
- చాక్లెట్ కంపెనీ ఓనర్ ఇంటిపై రెక్కీ
- 15 మంది అరెస్ట్..ఒకరి పరార్
- వెల్లడించిన మహేశ్వరం డీసీపీ

ఆదిబట్ల, జూన్ 16 : ఓ చాక్లెట్ కంపెనీ ఓనర్ ఇంట్లో భారీగా నల్లధనం ఉన్నదని, ఫేక్‌మనీని పెట్టి దాన్ని కొట్టేయాలని దోపిడీ దొంగలు వేసిన భారీ స్కెచ్‌ను ఆదిబట్ల పోలీసులు భగ్నం చేశారు. 15 మంది నిందితులను అరెస్టు చేయగా ఒకరు పరారీలో ఉన్నారు. ఈ ఘటన వివరాలను ఆదివారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి ఆదిబట్ల ఠాణాలో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లికి చెందిన బోగిని జంగయ్య, రియల్ ఎస్టేట్ వ్యాపారి. అతడికి శేఖర్‌రెడ్డి, మహమూద్ పరిచయమయ్యారు. దొడ్డిదారిలో డబ్బుకొట్టేయాలని వీరు రోజూ ఆలోచిస్తూ ఉండేవారు. ఇదే మున్సిపాలిటీ పరిధి శ్రీరాం నగర్‌కాలనీకి చెందిన చాక్లెట్ కంపెనీ ఓనర్ తిరుమన తురై ఇంట్లో రూ.950కోట్ల నల్లధనం ఉన్నదని అతడి వాచ్‌మన్ ద్వారా బోగిని జంగయ్య, శేఖర్‌రెడ్డి, మహమూద్‌తో పాటు పెద్ది శ్రీనివాస్‌కు తెలిసింది. వీళ్లు విజయవాడకు చెందిన రజాక్‌ను సంప్రదించారు. అతడు సతీశ్ అనే వ్యక్తికి ఫోన్‌చేసి చాక్లెట్ కంపెనీ ఓనర్ ఇంట్లో డబ్బు కొట్టేసేందుకు మనుషులు కావాలని లొకేషన్ పంపాడు. గతంలో పలు చోరీల్లో సహకరించిన జాఖీలఖానీ, మరికొందరు కలిసి భారీ స్కెచ్ వేశారు. ఫేక్‌మనీ, తయారీ పౌడర్, లిక్విడ్ అందుబాటులో ఉంచుకొని డబ్బు కొట్టేసిన తర్వాత దాని స్థానంలో వీటిని ఉంచాలని ప్లాన్ వేశారు. చాక్లెట్ కంపెనీ ఓనరే ఫేక్‌కరెన్సీని తయారు చేస్తున్నట్టు నమ్మించాలని ప్రణాళికలు వేసుకున్నారు. గత నెల 4న రాత్రి చోరీకి యత్నించి ఇంట్లో అలికిడి కావడంతో వెనుతిరిగారు. ఈ నెల 10న రాత్రి 1.30 గంటలకు 15 మంది చోరీ కోసం మళ్లీ వెళ్లారు. వాచ్‌మన్‌ను తాళ్లతో కట్టేసి, సీసీ కెమెరాల వైర్లను కట్‌చేశారు. తలుపులు పగులగొట్టేందుకు యత్నించగా అప్రమత్తమైన యజమాని 100కు కాల్ చేశాడు. పెట్రోలింగ్ వాహనం రావడాన్ని గమనించిన నిందితులు, వాచ్‌మన్ వద్ద ఉన్న కొంత నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. చాక్లెట్ కంపెనీ ఓనర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సతీశ్, జాఖీలఖా నీ, మహ్మద్ ఆదిల్, షాపూద్ హమ్మీ, సయ్యిద్ ఇస్మాయిల్, రహీముల్లాఖాన్, అక్బర్‌ఖాన్, ఎండీ జాఫర్, షమీముల్లా, మహ్మద్ ముదాషీర్, ఎండీ మహమూద్, బోగిని జంగయ్య, శేఖర్‌రెడ్డి, పెద్ది శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు. రజాక్ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి మూడు కార్లు, బైక్, 16 సెల్‌ఫోన్లు, మారణాయుధాలు, ఇనుపరాడ్డు, ఫేక్‌మనీ బండిల్, పౌడర్, రూ. 80వేలు స్వాధీనం చేసుకున్నారు.

- తడి కోసం తండ్లాట ?

అదును దాటుతున్నా వానల్లేవు. చినుకు కరువై విత్తిన విత్తుకు పదును లేక ఎండిపోతున్నది. ఈ నేపథ్యంలో పత్తిని కాపాడుకునేందుకు హనుమకొండ జిల్లా శాయంపేట శివారులో రైతులు స్ప్రింకర్లతో భూమిని తడుపుతున్న పరిస్థితి ఆదివారం కనిపించింది. పక్షం రోజుల క్రితమే ఓ మోస్తరు వర్షం కురవగా పత్తి విత్తనాలు నాటారు. ఆశించిన వానలు లేక నాటిన సగం విత్తనాలు మొలకెత్తలేదని రైతులు చెబుతున్నారు. మిగిలిన సగాన్ని స్ప్రింకర్లను పెట్టి విత్తనాలు, మొలకలు తడుపుతున్నట్టు రైతులు పేర్కొంటున్నారు. – శాయంపేట

నైరుతి వచ్చినా వానకు లోటే

- తొలకరితోనే సరి.. భారీ వర్షాలేవి?
- సాగు పనులపై రైతుల రంధి
- 14 జిల్లాల్లో లోటు వర్షపాతం
- జూలైలో భారీ వర్షాలు
- వాతావరణశాఖ అధికారుల వెల్లడి

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు నిర్దేశించిన సమయం కంటే ముందే దేశంలోకి ప్రవేశించినప్పటికీ.. రాష్ట్రంలోని 14 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. రుతుపవనాల ప్రారంభమైన జూన్ మొదటి వారంలో మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ..ఆశించిన స్థాయిలో భారీ వర్షాలు లేవు. దీంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రభావంతో సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అంచనా వేసినప్పటికీ..ప్రస్తుత పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. జూన్ 3న రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. జూన్ 5 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించాయి. జూన్ మొదటి వారంలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, ములుగు, రాజన్న సిరిసిల్ల జిల్లాల మినహా అన్ని జిల్లాల్లో సాధారణం నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

మొదలుకాని వ్యవసాయ పనులు

తొలకరి వర్షాలకు వ్యవసాయ పనులు మొదలుపెట్టాలని భావించిన రైతులకు నిరాశే మిగిలింది. సీజన్ ప్రారంభమై రెండు వారాలైఇప్పటివరకు ఒక్క భారీ వర్షం లేదు. ఇది వ్యవసాయ పనులపై ప్రభావం చూపే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల మొదటి వారంలో కురిసిన తొలకరికి కొన్ని జిల్లాల్లో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. రైతులు పత్తి, మక్కజొన్న,పెసర పంటలు సాగు మొదలు పెట్టారు. ఆ తర్వాత వానలు ముఖం చాటేయడంతో విత్తనాలు మొలకెత్తే పరిస్థితులు కనిపించక ఆందోళనకు గురవుతున్నారు. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం జూన్ 1నుంచి జూన్ 16 మధ్య కాలంలో రాష్ట్రంలోని 14 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మంచిర్యాల, హనుమకొండ,కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో అత్యంత లోటు వర్షపాతం నమోదైంది. ఈ లోటు వర్షపాతం ఆయా జిల్లాల రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది.

జూలైలో భ